నమస్తే తెలంగాణ

హైపర్ సానిక్ విజయం

శబ్దంతో పోలిస్తే ఐదింతల వేగంతో వెళ్లి శత్రు లక్ష్యాలను ఛేదించే హైపర్‌సానిక్ క్షిపణి పరీక్షను భారత్ ఆదివారం దిగ్విజయంగా పూర్తి చేయడం ప్రశంసనీయం. రక్షణరంగ దిగ్గజం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ (డీఆర్‌డీఎల్), పరిశ్రమ భాగస్వాములు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణి అనేక రకాలుగా ప్రత్యేకతలను సంతరించుకున్నది. అందులో ముఖ్యమైనది దీని పరిధి. 1,500 కిలో మీటర్ల దాకా అప్రతిహతంగా ఒకటి కంటే ఎక్కువ బాంబులను ఇది మోసుకువెళ్తుంది. ఈ అధునాతన సాంకేతికతను సంతరించుకున్న చైనా, రష్యా, అమెరికా వంటి పిడికెడు దేశాల సరసన భారత్ స్థానం సంపాదించడం ఓ గొప్ప మైలురాయి. మన రక్షణ దళాల అమ్ములపొదిలో హైపర్‌సానిక్ క్షిపణుల విశిష్టతను ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. రాష్ట్ర రాజధాని నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం క్షిపణి కేంద్రంలో దీన్ని అభివృద్ధి చేయడం తెలంగాణకు గర్వకారణం.

ఆధునిక సైనిక సంసిద్ధతలో హైపర్‌సానిక్ క్షిపణులు కీలక పాత్ర పోషిస్తాయి. ఉక్రెయిన్ యుద్ధంలో సైనిక నష్టాన్ని తగ్గించుకునేందుకు రష్యా హైపర్‌సానిక్ క్షిపణులపై ఆధారపడుతున్నది. అటు అమెరికా కూడా ఈ క్షిపణుల తయారీకి పెద్ద ఎత్తున నిధులను సమకూరుస్తున్నది. దూరం నుంచి శత్రు లక్ష్యాలను సంప్రదాయేతర మార్గాల్లో ధ్వంసం చేయడంలో ఇవి సమర్థవంతంగా పనిచేస్తాయనే ఉద్దేశంతోనే దేశాలు వీటి కోసం ప్రయత్నిస్తుంటాయి. బాలిస్టిక్ తరహాలో నిర్ణీత కక్ష్యలో ప్రయాణించకుండా వంకరటింకరగా ప్రయాణించే సామర్థ్యంతో ఈ క్షిపణులు శత్రుదేశం గగనతల రక్షణ వ్యవస్థల కన్నుగప్పి తమను తాము కాపాడుకోగలుగుతాయి. ముఖ్యంగా అణ్వాయుధాలను సంధించడంలో వీటి ఉపయోగం తప్పనిసరిగా అవసరం. వీటి తయారీ అనేక సంక్లిష్టతలు, అధిక వ్యయంతో కూడి ఉంటుంది. భారత్ వంటి వర్ధమాన దేశం అన్నిరకాల అడ్డంకులు దాటి శక్తిమంతమైన క్షిపణులు సమకూర్చుకోవడం మామూలు విషయం కాదు.

రక్షణరంగంలో విదేశీ దిగుమతులు పెరుగుతుండటంపై పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. సత్వర సరఫరా, విశ్వసనీయతలే అందుకు కారణం. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే హయాంలో రక్షణ దిగుమతులు 4.7 శాతం పెరగడం విడ్డూరం. మన మొత్తం దిగుమతుల్లో 36 శాతం రష్యా నుంచి, 46 శాతం అమెరికా, ఫ్రాన్స్ నుంచి వస్తున్నాయి. ప్రపంచ దిగుమతుల్లో పదో వంతు వాటా భారత్‌దే. పాకిస్థాన్‌కు అతిపెద్ద ఆయుధాల ఎగుమతిదారైన చైనా నుంచి మన దేశం డ్రోన్ పరికరాలను కొనుగోలు చేస్తున్నది. ఇలా రక్షణ ఉత్పత్తుల విషయంలో విదేశాలపై ఆధారపడటం కీలక సమయాల్లో ఒత్తిడికి గురిచేసే అవకాశాలుంటాయి. కొన్ని ప్రాజెక్టులు సకాలంలో విడిభాగాలు సరఫరా కాని కారణంగా జాప్యం అవుతుండటం మనం చూస్తున్నాం. తేజస్ ఫైటర్ జెట్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి అందుకు ఉదాహరణగా నిలుస్తున్నది. ఈ నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞాన అభివృద్ధి ఎంతైనా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. వ్యూహాత్మకంగా కీలకమైన క్షిపణుల తయారీలో మన రక్షణ రంగం తిరుగులేని ముందంజ సాధించడం శుభపరిణామం.

లగచర్లలో హక్కులపై ఉక్కుపాదం

దేశంలో రాజ్యాంగబద్ధ పాలన నడవాలంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ పెద్ద ప్రచారమే చేశారు. దానిని ఎన్నికల అంశంగా వాడుకున్నారు. అంబేద్కర్ మార్గాన్ని అనుసరిస్తానంటే వద్దనేది ఎవరు? కానీ, రాహుల్ మాటలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో, అదీ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే అమలు కాకపోతే నలువైపుల నుంచీ అభ్యంతరాలు వస్తాయి. లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటు విషయమై ఇంతవరకు జరిగిన చర్యలన్నీ రాజ్యాంగ ఉల్లంఘనలే. ఇక్కడ ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణ ఉద్రిక్తంగా మారింది. భూ సేకరణ ఉభయ పక్షాలకు లాభసాటిగా ఉండాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడమే దీనికి ప్రధాన కారణం. ఫార్మా విలేజ్ పేరిట రైతుల పంచ ప్రాణమైన భూములను లాగేసుకుంటుంటే అసలీ రాష్ట్రంలో రాజ్యాంగం అమలవుతున్నదా? అన్న అనుమానం వస్తున్నది.

ఎర్రోళ్ల శ్రీనివాస్

లగచర్ల ఏజెన్సీ గ్రామం కాకపోయినప్పటికీ ఇక్కడ ఉన్న గిరిజనులకు సంబంధిత చట్టాలలోని కొన్ని అంశాలు వర్తిస్తాయి. ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజనుల కోసం 2006లో ఆమోదించిన ఫారెస్ట్ రెగ్యులేషన్ చట్టం (ఎఫ్ఆర్ఏ) ఉన్నది. దీన్నే ట్రైబల్ ల్యాండ్ యాక్ట్ అని కూడా పిలుస్తారు. గిరిజనుల భూముల విషయంలో ఎలా వ్యవహరించాలో ఇందులో నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కలిగించడం, భూ సేకరణపై కొన్ని పరిమితులు విధించడం ప్రధాన అంశాలు. ఆ చట్టం స్ఫూర్తి మిగిలిన గ్రామాల్లోని గిరిజనులకూ స్పష్టంగా వర్తిస్తుంది. కానీ, ఆ నిబంధనలు పాటించకపోవడం వల్లనే సమస్యలు వస్తున్నాయి. 2013లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే ఆమోదించిన భూ సేకరణ చట్టం మరింత స్పష్టత ఇచ్చింది. ఈ చట్టం పేరే 'భూ సేకరణలో సముచిత పరిహారం, పారదర్శకత, పునరావాసం, ఉపాధి పునరుద్ధరణ హక్కు చట్టం' (ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్). ఈ చట్టం వివరాల్లోకి వెళ్లకపోయినా పేరు చదివితేనే విషయం అర్థమవుతుంది. ప్రస్తుతం తగిన పరిహారం, పునరావాసం, అంతకుమించి పారదర్శకత లేకపోవడం వల్లనే రైతులు ఆందోళనకు దిగారు. పేదల ఉపాధి కోసం ప్రభుత్వం ఇచ్చిన డీ-పట్టాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కూడా నిబంధనలు పాటించాలి. అకస్మాత్తుగా భూములు తీసుకుంటే వాటిలో పంట పండిస్తున్నవారు దిక్కులేని వారవుతారు. వారికి కూడా ప్రభుత్వం తగిన పరిహారం చెల్లించాలి. ఇది ప్రభుత్వం ఇచ్చే ఏక పక్ష ఆదేశాల రూపంలో కాకుండా సంప్రదింపుల రూపంలో ఉండాలి. ఇక్కడ మరో రూపంలోనూ రాజ్యాంగ ఉల్లంఘన జరిగింది. 19వ అధికరణం ప్రకారం ప్రతి పౌరునికి భావాలను వెల్లడించే స్వేచ్ఛ, సమావేశమయ్యే హక్కు ఉన్నది. ఈ హక్కులపైనే ప్రభుత్వం ఒత్తిడి పెంచుతున్నది. ఇవేవీ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు దోహదపడవు.

> **అన్నింటికన్నా అభ్యంతరకరమైన విషయమేమంటే.. భూముల్లేని వారు కూడా ఉద్యమంలో పాల్గొంటున్నారని చెప్పడం. ఈ విమర్శ ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. తోటివారి కష్టాల్లో పాల్గొనడం గ్రామాల్లో అనాదిగా వస్తున్న ఆచారం. గిరిజనులకైతే వారి జీవన విధానం. అలాంటి పరస్పర సహకారం లేకుంటే గూడేల్లో జీవించడమే కష్టం.**

పక్కవారి భూమి పోతున్నప్పుడు ఇరుగుపొరుగు వారు మద్దతు ఇవ్వకుండా ఉంటారా? నోరు లేనివారి తరపున మాట్లాడకుండా ఉంటారా? ఒకరికొకరు సహాయపడటమే కదా ప్రజాస్వామ్య జీవనవిధానం. కేరళలో వరదలు వస్తే తెలంగాణ వారు ఆర్థికసాయం చేయలేదా? ఇలా ఆదుకోవడాన్ని అధికారులు ప్రశ్నిస్తే సామాజిక స్పృహ ఉన్నవారికి కష్టం కలుగుతుంది. ఎవరో రెచ్చగొడితే రెచ్చిపోయి కేసుల్లో ఇరుక్కోవడం వారికేమైనా ఇష్టమా? నోటికాడి కూడు పోయిన దగ్గర, కడుపు మండిన చోట కిరాయి ఉద్యమాలుండవు. రైతుగా కాకున్నా ఏర్పాటయ్యే మందుల కంపెనీ వల్ల నష్టపోయే వ్యక్తిగా కూడా గ్రామస్థులకు అడిగే హక్కున్నది. ఔషధ కంపెనీ అంటే తప్పనిసరిగా దుర్వాసన వచ్చి పరిసరాలు కలుషితమవుతాయి. ఆ కారణంగా కంపెనీ ఏర్పాటు వల్ల కలిగే మంచి చెడులను ఎవరైనా అడగొచ్చు. ప్రపంచంలోని నిపుణులు, మేధావులూ ప్రశ్నించవచ్చు. అలాంటివి జరుగుతున్నాయి కూడా. నిస్సహాయులకు అండగా వచ్చినవారిని తప్పు పట్టడమంటే ప్రజాస్వామ్య జీవన విధానాన్ని కాదనడమే. అంటే రాజ్యాంగ విలువలను ఉల్లంఘించడమే. పైగా ఇలాంటి చర్యలు ప్రతికూల ఫలితాలు ఇస్తాయి. రైతులకు మద్దతుగా గిరిజన సంఘాలు, ఇతర సంస్థలు అండగా నిలిస్తే కాదనడం ఎలా సాధ్యం? ఇందుకు న్యాయస్థానాలు కూడా అంగీకరించవు.

సహజంగా తెలంగాణలో గ్రామస్థులు గానీ, గిరిజనులు గానీ ప్రభుత్వాధికారులను ఎప్పుడూ వ్యతిరేకించరు. వారి రాక కోసం ఎదురుచూస్తారు. ఇందుకు నా అనుభవమే ఉదాహరణ. గతంలో, నేను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు కామారెడ్డి జిల్లా గాంధారి మండలం కర్నంగడ్డ తండాకు వెళ్లేసరికి రాత్రి 12.30 గంటలైంది. అప్పటివరకు గిరిజనులు, ముఖ్యంగా మహిళలు తిండితిప్పలు లేకుండా ఎదురుచూస్తునే ఉన్నారు. అర్ధరాత్రి ఒంటిగంటకు వారితో కలిసి భోజనం చేసి సమస్యలు విన్నా. ప్రభుత్వ అధికారులతో గిరిజనులు ఎలా వ్యవహరిస్తారన్న దానికి ఇదో నిదర్శనం మాత్రమే. మరి లగచర్లలో గిరిజనులు తిరగబడ్డారంటే ఆ ఆప్యాయత, అనుబంధం ఎక్కడో మిస్ అయినట్టు కనిపిస్తున్నది.

> **గిరిజనులు భూమిని కోరుకునేది కేవలం కడుపు నింపుకోవడానికీ, డబ్బులు గడించుకోవడానికి కాదు. వారింకా వ్యవసాయ దశలోనే ఉన్నారు. ఇతర వ్యాపకాలు వారికి పెద్దగా తెలియవు. అందుకే ఏ అధికారి, నాయకుడు వెళ్లినా భూమి ఇప్పించాలనో, పట్టా మంజూరు చేయించాలనో కోరుతుంటారు.**

మహబూబ్‌నగర్ మండలం కోయల్తండాలో ఐదు ఎకరాలు, గొల్లబండ తండాలో 76 ఎకరాలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నప్పుడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ హోదాలో జోక్యం చేసుకున్నా. మొత్తం 100 కుటుంబాల వారికి తిరిగి పట్టాలు ఇప్పించే ఏర్పాటుచేశా. అవి ఇప్పుడు వారికి అందనున్నాయి. అటవీ భూములను గిరిజనులకు ఇప్పిస్తే చెట్ల సంఖ్య తగ్గి పర్యావరణానికి నష్టం కలగదా అని అడగవచ్చు. గిరిజనులు పండించే జొన్నచేను, కంది మొక్కలు కూడా వృక్ష జాతికి చెందినవే. పర్యావరణానికి అంతో ఇంతో మేలు చేస్తాయి. నష్టం మాత్రం కలిగించవు.

భూ సేకరణ చేసేటప్పుడు ప్రజలకు నచ్చజెప్పి మెప్పించాలి. అధికార దర్పం ఏ మాత్రం పనికిరాదు. పోలీసు బందోబస్తు అధికంగా ఉంటే వారిని చూసే భయపడిపోతారు. పోలీసులు ఉంటే మా అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పలేమని రైతులు, గిరిజనులు అన్న సందర్భాలున్నాయి. అందువల్ల పోలీసుల ప్రమేయం ఎంతవరకు ఉండాలన్న దానిపై పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. సింగరేణి బొగ్గు గనుల కోసం భూములు సేకరించినప్పుడు అన్ని విషయాలను అధికారులు వివరంగా చెప్పేవారు. బొగ్గు నిల్వలు ఈ గ్రామంలోనే ఉన్నందున ఇక్కడి భూమే సేకరించక తప్పదని చెప్పేవారు. చెల్లించే పరిహారం, కంపెనీ తరపున కల్పించే సౌకర్యాల గురించి వివరించేవారు.

మరి కొడంగల్ నియోజకవర్గంలో ఎన్నో గ్రామాలుండగా ఫార్మావిలేజ్ ఏర్పాటుకు ఒక్క లగచర్లనే ఎందుకు ఎంచుకున్నారో నచ్చజెప్పాలి. మార్కెట్ ధర, ప్రభుత్వ ధర అన్నింటిని బేరీజు వేసి ఒక నిర్ణయానికి రావాలి. కొన్నిసార్లు మొత్తంగా ఊరికి ఊరునే తొలగించాల్సి వస్తే రైతులతో పాటు వారిపై ఆధారపడిన వృత్తుల వారికి, చిన్న వ్యాపారులకూ పునరావాసం, ఉపాధి కల్పించాలి. ఇల్లూ వాకిలి లేవని, వారికి ఎలాంటి పరిహారం ఇవ్వక, ప్రత్యామ్నాయం చూపక వదిలేస్తే ఎలా బతుకుతారు? ప్రతీ ఒక్కరి సమస్యను పట్టించుకున్నప్పుడే భూ సేకరణ సాఫీగా సాగుతుంది. ఇవేవీ కాకుండా పోలీసు కేసులు పెట్టడం, తనిఖీలు అంటే మొదటికే మోసం వస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన అన్న మరో సమస్య తెరపైకి వస్తుంది. ఇతర ప్రాంతాల్లోని ప్రాజెక్టులపైనా ప్రభావం చూపుతుంది.

ప్రభుత్వ ఉద్యోగిని ఒకచోట నుంచి మరొక చోటికి బదిలీ చేస్తేనే బాధపడుతారు. అలాంటిది తనకు అన్ని హక్కులున్న భూమిని శాశ్వతంగా తీసుకొని ఏమీ లేనివానిగా నిలబెడుతామంటే రైతుల్లో ఇంకెంత బాధ ఉంటుంది? ఈ మానసిక స్థితిని అర్థం చేసుకున్నప్పుడే భూ సేకరణకు మార్గం సులువవుతుంది. అంతే తప్ప లా పాయింట్లు లాగడం ద్వారానో, అధికార హోదా ప్రదర్శించడం ద్వారానో, బెదిరింపులకు పాల్పడటం ద్వారానో సాధ్యపడదు. తెలంగాణ చరిత్ర మొత్తం చెప్పిన గుణపాఠం ఇదే. దీన్ని మరిచిపోతే ఏం జరుగుతుందో కూడా చరిత్రలో పాఠాలున్నాయి. మరి ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఆదర్శ భూ సేకరణ విధానాన్ని ఆశించవచ్చా?

(వ్యాసకర్త: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్)

మరాఠీల మనసులో ఏమున్నది?

మహారాష్ట్రలో గత వారం కింద కొన్నిరోజుల పాటు పర్యటించినపుడు ఒక విషయం గుర్తించి ఆశ్చర్యం కలిగింది. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో ఓడినప్పటికీ అక్కడి ప్రజలు ఇప్పటికీ ఆ పార్టీని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ వేరే రాష్ట్రపు పార్టీ. అధికారంలో ఉండినపుడు మహారాష్ట్రలో ప్రచారం సాగించింది కొద్ది నెలలు మాత్రమే. అధికారం కోల్పోయి ఏడాది అవుతున్నది. తర్వాత కాలంలో అటు వైపు వెళ్లలేదు. ఈ మాటలన్నీ గమనించినప్పుడు మామూలుగానైతే అక్కడి ప్రజలు బీఆర్ఎస్‌ను మరిచిపోయి ఉండాలి. కానీ, పరిస్థితి ఆ విధంగా ఎంతమాత్రం లేదు. ఆశ్చర్యం కలగటం అందువల్లనే.

టంకశాల అశోక్



వెళ్లింది మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాలకు. అక్కడ నాందేడ్ వంటి ఒక ముఖ్య నగరంతో పాటు కొన్ని పట్టణాలకు, గ్రామాలకు పోయి కలిసి మాట్లాడిన వారిలో పలు వర్గాల వారున్నారు. అందువల్ల, బీఆర్ఎస్ పట్ల అభిమానం, దానితో పాటు నమ్మకం అన్నవి మహారాష్ట్ర సమాజంలో విస్తృతంగా నేటికీ నిలిచి ఉన్నాయనే అభిప్రాయానికి రాక తప్పలేదు. అందుకు కారణాలు ఏమిటన్నది వారి మాటలలోనే వినేందుకు ప్రయత్నించాను. అవి విన్న మీదట, వారందరు చెప్పిన వాటి సారాంశం ఒకేవిధంగా ఉండటం గమనించాను. అప్పుడు అర్థమైంది బీఆర్ఎస్ మహారాష్ట్రలో నేటికీ ఒక భావనగా ఎందుకు సజీవంగా ఉన్నదో.

> **పైన పేర్కొన్న వేర్వేరు వర్గాల వారి మాటల సారాంశమేమిటో ముందుగా చూద్దాం. వారు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమిటో పదేండ్ల పాటు గమనించారు. దానిని తమ పరిస్థితులతో పోల్చి చూసుకున్నారు. కేసీఆర్ తెలంగాణలో మాట్లాడుతున్నదేమిటో వార్తలు, సమాచారం అందుతూనే ఉన్నాయి. తర్వాత తమ వద్ద సభలలో చెప్పింది ప్రత్యక్షంగా విన్నారు.**

మరొకవైపు తమ రాష్ట్రాలకు చెందిన వేర్వేరు పార్టీల నాయకులు చెప్పింది వింటూ ఈ రెండింటినీ పోల్చుకున్నారు. కేసీఆర్‌లో వారికి దేశ పరిస్థితులు, దేశాభివృద్ధి, దీర్ఘకాలిక దృష్టి విషయాలలో ఒక దార్శనికుడు కనిపించగా, ఇతర పార్టీల వారిలో కేవలం అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెప్తూ మోసగించే వారే ఉన్నారు. వీటన్నింటికి తోడు కేసీఆర్ తన ఆలోచనలేమిటో చెప్తూ పోయారు తప్ప ఇతరులను విమర్శిస్తూ గడపలేదు. అంతిమంగా, 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే అద్భుతమైన నినాదాన్నిచ్చి అందరి మనస్సులను తాకారు.

ప్రజల మాటల్లో రాజకీయపరమైనవి కూడా కొన్నున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమిని వారు నిజమైన ఓటమిగా చూడటం లేదు. రాజకీయాలలో జయాపజయాలు జరుగుతూనే ఉంటాయన్నది ఒక అభిప్రాయం. కాంగ్రెస్ ఇచ్చిన మితిమీరిన హామీలు పనిచేశాయన్నది మరొక అభిప్రాయం. దానినట్లుంచితే, బీఆర్ఎస్ తెలంగాణలో ఓడినా మహారాష్ట్రలో తన పని కొనసాగించి ఉండవలసిందన్న మాట అంతటా వినిపించింది. అట్లా చేసి ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే చెప్పుకోదగినన్ని స్థానాలు గెలిచి ఉండేదన్నారు వారు. కేసీఆర్ తెలంగాణలో మళ్లీ గెలిచి మరొక నాలుగేండ్ల తర్వాతనైనా సరే తిరిగి వచ్చినట్లయితే అంతే ప్రజాదరణ లభించగలదని చెప్పారు.

ఇవీ సారాంశాలు. వీటిని చుట్టుకొని ఉన్న వివరాలను, అందుకు సంబంధించి ప్రజల మాటలను, వాటిని ప్రతిఫలించే మహారాష్ట్ర స్థితిగతులను చెప్పుకోవాలంటే చాలా ఉన్నాయి. వీటన్నింటిని కలిపి చూసినప్పుడు గాని, బీఆర్ఎస్ అక్కడ ఎందుకింకా సజీవంగా ఉన్నదో, కేసీఆర్ పేరు మరవలేనిదిగా మారిందో, భవిష్యత్తులో ఆయన తిరిగి తమ మధ్యకు రావాలనే కోరిక బలంగా ఉందో మనకు అర్థం కాదు. తాత్త్వికంగా చెప్పుకోవాలంటే, ఈ తత్త్వానికి మూలాలు, ఆధారాలు అక్కడి పరిస్థితులలో ఉన్నాయి. అక్కడి చారిత్రకమైన వెనుకబాటుతనంలో, రైతులూ పేదల ఘర్షణలలో, గురువులూ సంఘ సంస్కర్తలకు లభించిన ఎనలేని ఆదరణలో ఉన్నాయి. వర్తమానానికి వస్తే అన్ని పార్టీల వైఫల్యంలో, సామాన్యులలో తరతరాలుగా గూడు కట్టుకొని ఉన్న బాధలో, నిరసనలో ఉన్నాయి. ఎక్కడైనా, ఎపుడైనా ఆర్థిక, సామాజిక స్థితిగతులు ఆ విధంగా ఉండి ఒక తాత్త్వికత ఏర్పడినప్పుడు ప్రజలు సహజంగానే దానినుంచి వెలికి వచ్చేందుకు ప్రయత్నిస్తారు. అందుకు మార్గం ఒక దశలో కొందరికి ఒక సంఘ సంస్కర్త రూపంలో కనిపించవచ్చు. మరొక దశలో ఒక తిరుగుబాటు రూపంలో కావచ్చు. రాజకీయంగా చూస్తే ప్రస్తుతం కేసీఆరా, రేపు మరొకరా అన్నది కాదు ప్రశ్న. ఎవరైనా కావచ్చు.

ఆదిలాబాద్ జిల్లాను దాటి మరాఠ్వాడా ప్రాంతంలోకి అడుగుపెట్టడమే తడవు రెండు రాష్ట్రాలకు మధ్య గల తేడా ఏమిటో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఆ రోడ్లు, గ్రామాలు, పట్టణాలు, ప్రజలు, దుకాణ సముదాయాలు, రవాణా బస్సులూ, సమస్తం ఆ తేడాను ప్రతిఫలిస్తాయి. వీటన్నింటి మధ్య గమనించదగినదేమంటే భూములన్నీ సారవంతమైన నల్లరేగడివి. అయినప్పటికీ సరిహద్దుకు ఇటు అభివృద్ధి, అటు వెనుకబాటుతనం అనే ఒకే ఒక్క తేడాలోనే పైన చెప్పుకున్న తాత్త్వికతకు గాని, కేసీఆర్ పట్ల పొంగుకొచ్చిన ఆశలకు గాని బీజాలున్నాయి. వాటిని ఆయన ఏ కారణం చేతనైనా సరే అదేవిధంగా వదిలివేసినట్లయితే, అది అక్కడి ప్రజలకు ఒక చారిత్రక విషాదం వంటిదవుతుంది. ఈ మాట అతిశయోక్తిగా తోచవచ్చు. అవునో, కాదో అర్థం కావాలనే స్వయంగా అక్కడికి వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడవలసి ఉంటుంది. పైన చెప్పినట్టు వీరు వారని గాక అన్ని వర్గాలలో, నగరాల నుంచి గ్రామాల వరకు, ఏడాది వ్యవధి తర్వాత కూడా మరొక రాష్ట్రంలో ఇటువంటి అభిప్రాయాలున్నప్పుడు, ఇది గాక మరొక మాట చెప్పగలమా?

టీఆర్ఎస్ అనే ప్రాంతీయ పార్టీని బీఆర్ఎస్ అనే జాతీయ పార్టీగా ఒక మౌలికమైన, దీర్ఘకాలికమైన దార్శనికతతో మార్చిన కేసీఆర్, ఈ విధమైన కదలికలను అంతటితో అణగారిపోకుండా చూడవలసి ఉంటుంది. అట్లా జరగకపోతే అది ఒక విషాదమవుతుంది. ఈ సందర్భంలో చర్చించుకోవలసిన ముఖ్య విషయం ఒకటున్నది. ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చినప్పుడు పలువురు పలు విధాలైన సందేహాలను, ప్రశ్నలను లేవనెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పుడు పలువురు పలు విధాలైన సందేహాలను, ప్రశ్నలను లేవనెత్తారు.

> **గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పుడు ఆ ప్రశ్నలు తీవ్రంగా మారాయి. అవి పార్టీ లోపలి నుంచి, బయటినుంచి కూడా వినిపించాయి. తిరిగి టీఆర్ఎస్‌గా మార్చాలనే ఒత్తిళ్లు పెరిగాయి. కానీ, అందుకు కేసీఆర్ నిరాకరించటం గమనించదగ్గది. ఎందుకు కాదంటున్నారో ఆయన వివరించిందీ లేనిది తెలియదు గాని, మనకుగా ఆలోచిస్తే తోచేవి కొన్నున్నాయి.**

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చటానికి ఏ కారణాలున్నాయో వాటికి ఇప్పటికీ అదే విలువ ఉందన్నది తమ అభిప్రాయం కావచ్చు. తెలంగాణలో ఒకసారి ఓడినంత మాత్రాన ఆ విలువ మాయమైపోదు. నిజానికి మన రాజ్యాంగం ప్రకారం చూసినా ప్రాంతీయతలకు, జాతీయతకు మధ్య వైరుధ్యమేమీ లేదు. బలమైన రాష్ట్రాలు, బలమైన కేంద్రం అనే మాట, సహకార ఫెడరలిజం అనే మరొక మాట ఉన్నాయి. కనుక వైరుధ్యమేమీ లేదని ఆ విధంగా కూడా స్పష్టమవుతున్నది. మరొక విధంగా చెప్పాలంటే, ఇంగ్లీషులో వన్ ఫర్ ఆల్, ఆల్ ఫర్ వన్ అన్నట్టు ఇది అందరి కోసం (రాష్ట్రాలు) ఒకరు (కేంద్రం), ఒకరి కోసం అందరూ వంటి స్థితి. ఈ అవగాహన గాని, రాజ్యాంగపరమైన ఏర్పాటుగాని సజావుగా సాగి ఉంటే పరిపాలనలు, పరిస్థితులు అందుకు తగినట్టే ఉండేవి. కానీ, కాంగ్రెస్ నుంచి మొదలుకొని ఫ్రంట్ ప్రభుత్వాలు తప్ప, అందరూ అందుకు విరుద్ధంగా పాలిస్తూ వచ్చారు. సమతులనం లేని అభివృద్ధి, అంతర్గత వలసలు, అధికార కేంద్రీకరణలు, ధనిక వర్గాలకు అనుకూలమైన విధానాలు, రాష్ట్రాల హక్కులను హరించటం వల్ల ఈ రాజ్యాంగ లక్ష్యాలు దెబ్బతిని ఫెడరల్ శక్తులు మామూలుకు మించి బలపడుతూ వచ్చాయి. ప్రాంతీయ పార్టీలు ఎప్పుడైనా ఉంటాయి. కానీ, ఇటువంటి కారణాల వల్ల సహకార ఫెడరలిజానికి బదులు ఫెడరల్ శక్తులకూ, జాతీయత పేరిట చలామణి అయ్యే సెంట్రలిస్టు శక్తులకు మధ్య వైరుధ్యాలు ఏర్పడి క్రమంగా తీవ్రమవుతూ పోయాయి. ఆ విధంగా చూసినప్పుడు, దేశానికి ఒక జాతీయత, జాతీయ పార్టీలు ఎట్లాగైనా అవసరం గనుక అవి ఉంటూనే, ప్రాంతీయ పార్టీలు కూడా ఒక తప్పనిసరి అవసరంగా మారాయి.

ఇప్పుడు దీనినంతా పరిగణనలోకి తీసుకొని చూసినప్పుడు, కేసీఆర్‌కు తెలంగాణ ప్రయోజనాల కోసం టీఆరెస్ అవసరమైనట్టే, తెలంగాణ ఒక భాగమైన దేశ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ కూడా అంతే అవసరమనిపించితే అందులో ఆశ్చర్యం గాని, వింత గాని ఏమీ ఉండనక్కరలేదు. ఆ రెండు సూత్రీకరణలు సహజ మిత్రుల వంటివి. ద్వైతాద్వైతాల సహ ప్రయాణమది. రెండింటి మౌలిక లక్ష్యాలు, దార్శనికతల మధ్య నిజమైన అర్థంలో ఎటువంటి వైరుధ్యం కనిపించదు. రూపాన్ని బట్టి అవి వేర్వేరు కావచ్చు. కానీ, సారాన్ని బట్టి ఒకటే. తాను తెలంగాణలో చేసిన కృషి తమ వద్ద కూడా జరగాలని మహారాష్ట్ర ప్రజలు ఒక పొడగింపును చెప్పుకొన్నట్టు, ఆ పొడగింపు దేశమంతటా జరగాలన్నది ఆయన ఉద్దేశమైతే, రెండు రూపాలకూ వాటి ఉమ్మడి సారానికీ వైరుధ్యం ఎక్కడి నుంచి వస్తుంది? కనుక, స్థూలంగా కాదు, సూక్ష్మంగా ఆలోచించటం అవసరం అని మహారాష్ట్ర ఉదాహరణ చెప్తున్నది. వాస్తవానికి, రెండింటి మధ్య వైరుధ్యాన్ని ఇటువంటి స్థూలమైన దృష్టితో తెలంగాణలోని 'అర్బన్ క్రౌడ్' అనబడేది చూసింది. వారు, ప్రతిపక్షాలు కలిసి ప్రచారాలు చేసి కొందరిని నమ్మించారు. కానీ, నేను తెలంగాణ గ్రామీణులతో, పట్టణాలలోని సామాన్యులతో మాట్లాడినంతవరకు, వారికి అటువంటి వైరుధ్యమేమీ తోచలేదు, పట్టించుకోలేదు. మహారాష్ట్రలో, ఆ కాలంలో కేసీఆర్‌ను సంప్రదించిన ఇతర రాష్ట్రాల వారిలోనూ సరిగా అంతే జరిగిందనుకోవాలి.

తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కీలకమైన కృష్ణానదితో పాటు తుంగభద్ర, కొన్ని ఉప నదులపై నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్టు మూలంగా లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. నిర్వాసితుల త్యాగాలపై నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్టు మరోసారి ప్రజల జీవితాలను ఎండబెట్టబోతున్నది. శ్రీశైలం కనీస నీటి మట్టం నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ అవుతున్నా మౌనంగా ఉండి ప్రభుత్వాలు రేపటి భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టివేస్తున్నాయి.

జల దోపిడీపై మౌన ముద్ర

సీపీ నాయుడు
85199 91515

ఈ ఏడాది వర్షాలు బాగా పడ్డాయి. ఎగువ ప్రాంతం నుంచీ వరద జలాల ఉధృతి అధికంగా వచ్చింది. అందరూ భావించినట్టే రైతులు కూడా రెండు పసళ్ల పంటలను సాగుచేసుకోచ్చని సంబురపడ్డారు. కానీ, పరిస్థితి ఇందుకు భిన్నంగా కన్పిస్తున్నది. శ్రీశైలం నీటిమట్టం అతివేగంగా కనిష్ఠ స్థాయికి చేరుకుంటున్నది. సాగునీటికి ఢోకా ఉండదని భావించినవాళ్లు తాగు నీటి కోసం మదన పడుతున్నారు. మళ్లీ చెలిమెలకు పని చెప్పే కాలంతో పాటు బోరుబావుల చుట్టూ బిందెలతో పరుగులు తీసేకాలం వస్తుందేమోనని భయపడుతున్నారు. దీనికి కారణం శ్రీశైలం నీటిని ఏపీలోని పోతిరెడ్డిపాడుకు తరలిస్తుండటమే. ముఖ్యంగా యంజీఎల్ఐ ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథకు నీళ్ల కేటాయింపు జరుగుతున్నది. ఈ నీళ్లు ఆగిపోతే దక్షిణ తెలంగాణ గొంతెండుతుంది. ఉన్న కాస్త నీళ్లను సాగు అవసరాలకు వాడుకోలేక తెలంగాణ రాష్ట్రానికే కాక దేశ విదేశాలకు ఎగుమతి చేసే మామిడితోటలు, ఆయిల్‌పాం తోటలు నీటి ఎద్దడితో ఎండిపోయే ప్రమాదం ఉన్నది.

తెలంగాణ ప్రభుత్వం మాత్రం రాజకీయాలతో కాలక్షేపం చేస్తున్నది. రాష్ట్రంలోని హైదరాబాద్ మినహా మిగిలిన భూ భాగమంతా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నది. దీంతో సాగునీటి ప్రాముఖ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కానీ, తప్పనిసరి పరిస్థితిలో సాగునీటి గురించి ఆలోచించవలసిన అవసరం తెలంగాణ మేధావుల భుజస్కంధాలపై ఉన్నదని గుర్తుచేస్తున్నాను. ఎందుకంటే వరద జలాలను వినియోగించుకోవడంలో లోపం జరిగింది. ఉన్న జలాలను సైతం వినియోగంలో తెచ్చేందుకు ప్రభుత్వం శక్తి సామర్థ్యాలను వెచ్చించలేదు. ఉమ్మడి ఏపీలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జలయజ్ఞం పేరుతో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. జలయజ్ఞంపై ఆరోపణలు వచ్చినా, ఆచరణలో రైతులకు కొంతమేర సాగు నీరందింది. నీళ్ల కోసం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ మొదటి ప్రయత్నంలో చెరువుల పూడికలతో పాటు గత ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తిచేయడంతో పాటు నూతన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి అనతికాలంలోనే రైతులకు సాగునీళ్లిచ్చారు. తద్వారా బీడు భూముల్లో పచ్చగా కళకళలాడాయి. ఒకప్పటి కరువు నేల నేడు అన్నపూర్ణ నేలగా ధాన్యపురాశులతో వెలుగొందుతున్నది. కానీ, పాలకులు మారినప్పుడు వారి ఆలోచనా విధానం మార్చుకుంటున్నారు. ఆ ఆలోచన అభివృద్ధి కోసమైతే ఫర్వాలేదు కానీ, గత పాలకులు చేసిన మంచి పనిని కొనసాగించేందుకు వెనుకాడుతుండటమే బాధాకరం.

పోతిరెడ్డి పాడు నుంచి రోజుకు 24 వేల క్యూసెక్కుల నీళ్లు అంటే దాదాపు రెండు టీఎంసీల కృష్ణానది నీళ్లను తరలిస్తున్నారు. మూడు టీఎంసీల వరకు కూడా నీళ్లను తరలించే మెకానిజం పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు ఉన్నది. కానీ, మన మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలోని ఐదు మోటర్లలో ఒక్క అదనపు మోటరు మినహా నాలుగు మోటర్లు రోజంతా కృష్ణా నది నీళ్లను ఎత్తిపోసిన 4 వేల క్యూసెక్కులకు దాటదు. కానీ, గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని శ్రీకారం చుట్టడం కాక తొమ్మిది బాహుబలి మోటార్లలో ఒక్క బాహుబలి మోటర్‌తోనే మొదటి రిజర్వాయర్‌లోకి నిబంధనల ప్రకారం మూడో వంతు రెండు టీఎంసీల కృష్ణా నీళ్లను ఎత్తిపోశారు. మళ్లీ ఈ ఏడాది కూడా నిబంధనల ప్రకారం రెండు టీఎంసీల నీళ్లను రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయాలి. కానీ, బహుశా ప్రభుత్వం కక్ష రాజకీయాలతో తీరిక లేకుండా ఉండటంతో సాగునీటి అవసరాల సంగతి మర్చిపోయినట్టున్నది.

ఏడాది కాలంలో చిన్న చిన్న పెండింగ్ పనులను పూర్తిచేసి ఉంటే ఈరోజు పోతిరెడ్డిపాడుకు దీటుగా కృష్ణా నది నీళ్లతో నెర్రెలు బారిన నేలల దాహం తీర్చే అవకాశం ఉండేది. కానీ, ప్రస్తుతం 875 అడుగుల నీటి మట్టం ఉన్న పోతిరెడ్డి పాడు నుంచి నిరంతరం నీటి తరలింపు కొనసాగుతున్నది. 830 అడుగుల వద్ద తాగు నీటి అవసరాల కోసం నిల్వ ఉంచాలనే నిబంధనలున్నా, వాటిని పట్టించుకోకుండా శ్రీశైలంను ఖాళీ చేస్తున్నారు. ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడంతోనే శ్రీశైలంలోని నీళ్లను ఖాళీ చేస్తున్నారనుకుంటే పొరపాటు పడినట్టే. ఆ తరలింపులు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్నవే. ఈ జలదోపిడీపై మేధావులు, నిపుణులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.